త్రైలోక్యగీత

పదకొండవ అధ్యాయము

మధుర భక్తి విచారయోగము

త్రైలోక్యా ఉవాచ:-

పరిపూర్ణ తమః కృష్ణః!, గోప్యః పూర్ణాస్తపోఽగ్నయః |
కథం కామేన గోలోకః, పూర్ణో దత్త గురూత్తమ!? ||11.1||

[**కుమారి త్రైలోక్య ఇలా అడిగింది:-** ఓ దత్త దేవా! పరమోత్తమ ఆధ్యాత్మిక ప్రబోధకా! భగవంతుడైన కృష్ణ దత్తుడు ఉత్తమమైన పరిపూర్ణ నరావతారముల యందు ఉత్తముడు. **(పరి= ఉత్తమ, తమః = ఉత్తమ, పూర్ణ = ఉత్తమ).** ఎంతో ఘోరతపస్సు చేసి యజ్ఞ సమిధల వలె పరిణతి చెందిన గోపికలు మరెవరో కాదు, ఋషులు. కృష్ణ దత్తుడు వారికి గోలోకమును ఇచ్చాడు. కర్మఫలంగా గోలోకము లభించడం ఎంతటి విశిష్టమైనది అంటే అది స్వయంగా భగవంతుని నివాసమైన వైకుంఠమునకు పైన గల లోకము. వీరి విషయంలో చూసినట్లైతే గోపికలు శ్రీ కృష్ణదత్తుని పట్ల అనుసరించిన మార్గము అధర్మబద్ధమైన కామము. మరి ఆ మార్గమెట్లు ధర్మసమ్మతమైనది?]

దత్తస్వామీ ఉవాచ:-

త్రైలోక్యే! సత్త్వ సంపూర్ణే! సాత్త్వికా ఏవ జానతే |
బ్రహ్మజ్ఞాన నిగూఢార్థం, న హి రాజస తామసాః ||11.2||

[**శ్రీ దత్త స్వామి వచించారు:-** ఓ త్రైలోక్య! నిండైన ఉత్తమ స్వభావి (**సాత్త్వికురాలు**) నీవు! లోతైన ఆధ్యాత్మిక జ్ఞానమును అర్థం చేసుకొనవలెనంటే నిండైన సాత్త్విక గుణములు

గల వారికే సాధ్యము. ఈర్ష్య గలవారు (**రాజసిక స్వభావము),** అజ్ఞానులకు (**తామసిక స్వభావము)** ఇట్టి సూక్ష్మ విషయ పరిజ్ఞానము సాధ్యము కాదు. ఎందుకంటే సత్త్వము అనునది జడము కాని చైతన్యము. కాని రజోగుణము అంటే జడమైన శక్తి మరియు తమోగుణము అంటే జడమైన పదార్థము. (సత్త్వము అంటేనే చైతన్యము కావున సత్త్వ స్వభావము అనేది లోతైన జ్ఞాన శక్తి. రజస్సు మరియు తమస్సులు జడమైనవి మరియు సత్త్వము పైన ఇవి ప్రభావము చూపడంతో జ్ఞానశక్తి క్షీణిస్తుంది. అయితే ఈ మూడింటిలో ఏ ఒక్క గుణము కూడా 100% గా ఏకాకిగా మనలేదు. చైతన్యమెప్పుడూ రజస్సు మరియు తమస్సులను కూడి ఉంటుంది. రజస్సు మరియూ తమస్సులు సత్త్వమును అధిగమిస్తే అటువంటి సత్త్వము లేదా చైతన్యమును రాజసిక మరియు తామసిక స్వభావములు అంటారు. సత్త్వమే అధిగమించినట్లైతే దానిని సత్త్వ స్వభావము అంటారు. అయితే రజస్సు మరియు తమస్సు తమంతట తాముగా జడమైనవే అయినప్పటికీ అవి ఎప్పుడూ సత్త్వమును కూడియే ఉంటాయి. ఇక్కడ స్వభావము అనే శబ్ద ప్రయోగము జడమైనవో, జడము కానివో అయిన వస్తుస్వభావములు అనే అర్థము కొరకు కాక స్వభావము అనేది ఆలోచన అనే అర్థములోను, ఇంకా సత్త్వముతో ముడిపడి ఉన్న జడము కాని చైతన్యము యొక్క స్వభావము అనే అర్థములో ప్రయోగించ బడినది.)]

దోషో పక్షేఽపి గోపీనాం, ద్రైవే సర్వో విలిప్యతే |
సర్వజ్ఞ సర్వ శక్తిత్వాత్, దత్తః కృష్ణ స్త్రిమూర్తిమాన్ ||11.3||

[ఈ విషయమును పరిశీలిస్తే గోపికలు జీవాత్మలు మరియు శ్రీకృష్ణదత్తుడు స్వయంగా పరమాత్ముడే. అయినప్పటికీ గోపికలు చేసిన అపరాధములను మానవ సహజ తప్పిదాలు కదా, క్షమార్హమేలే అని బలపరుస్తారు. కాబట్టి మొత్తం అపరాధమంతా భగవంతుడైన కృష్ణునకే ఆపాదించారు

ఎందుకంటే ఆయన సర్వ శక్తిమంతుడు, సర్వజ్ఞుడు. నిజానికి సునాయాసంగా గోపికలు చేసిన తప్పులను ఎన్నింటినో మనం గమనించినప్పటికీ, ఆ నేర భారమంతా శ్రీకృష్ణదత్తుని మీదనే పడుతున్నది. అటువంటి శ్రీకృష్ణ పరమాత్మ పరమోత్కృష్టమైన దత్త దేవుడు. శ్రీకృష్ణదత్తుడు బోధించి, గానము చేసిన అనూహ్యమైన ఆధ్యాత్మిక జ్ఞానము అయిన భగవద్గీత అతడు సాక్షాత్తు బ్రహ్మదత్తుడేననే సత్యమును ధ్రువీకరిస్తున్నది. తన భక్తుల మీద గల అనూహ్యమైన ప్రేమ చేత వారికి ప్రసాదించబడిన ఉత్కృష్టమైన గోలోకము అతడు సాక్షాత్ శ్రీ మహావిష్ణుదత్తుడు అని ధ్రువీకరిస్తున్నది. అలవికాని మహిమలు ప్రదర్శించినందున సాక్షాత్ పరమశివదత్తుడేనని తెలియుచున్నది.)]

ప్రవృత్తిధర్మ వక్తా చ, స్థాపకో రక్షకస్స కిమ్ |
ఈశ్వరః పాప భాగేవం, పృష్టం చాపి పరీక్షితా ||11.4||

[పరమపావనుడైన అనూహ్య పరబ్రహ్మము అయిన దత్త దేవుడు మొదటగా ధరించిన తేజోరూపమును ఎవరైతే, ప్రథమ తేజోరూపావతారుడు అని లేదా ఈశ్వరుడు అని లేదా స్వర్గలోకపు తండ్రిగా పిలువబడినవాడో అతడే శ్రీకృష్ణదత్తుడుగా అవతరించి, నరులకు ప్రాపంచిక జీవిత విధానమును తెలుపుటకు శ్రేష్ఠమైన ధర్మ గ్రంథమును రచించినవాడు. ఆతని చేతనే ధర్మమార్గ ప్రతిష్ఠ జరిగినది మరియు సర్వత్రా ఆ ధర్మగ్రంథము పరిరక్షించబడుతున్నది. అయితే స్వయముగా శ్రీకృష్ణదత్తుని చేతనే ప్రాణరక్షణ చేయబడిన పరీక్షిత్ మహారాజు కూడా సందేహంతో శుకమునిని ఇలా ప్రశ్నించాడు, "అంతటి పరమపవిత్రుడైన భగవంతుడు పరుల భార్యలతో నీచపాపమైనట్టి అధర్మబద్ధపు కామక్రియలో ఎలా పాల్గొన్నాడు?" **(స కథం ధర్మ సేతూనాం**, **వక్తా కర్తాభిరక్షితా, ప్రతీపమాచరత్ బ్రహ్మన్, పరదారాభిమర్శనమ్? -** *భాగవతము.)*]

అపవ్యాఖ్యాతృ జీవత్వాత్, హేతుః సత్యోఽపి నోచ్యతే |
తస్యానుసరణం రుద్ధం, నోహ్య శక్తేః పరాత్మనః ||11.5||

[ఈ ప్రశ్నకు శుకముని నేరుగా సమాధానమీయలేదు. బదులుగా శ్రీకృష్ణదత్తుడు సాక్షాత్ పరమాత్ముడని తానెప్పుడూ ధర్మవర్తనుడేనని, కాని సాధారణ జనులెవ్వరూ తనను అనుసరించరాదని మాత్రమే తెలిపాడు. ఇట్టి సమాధానము చూస్తే శుకమునికి ఈ ప్రశ్నకు దీటైన సమాధానమివ్వగల శక్తి లేదేమోననే సంశయం కలుగక మానదు. కాని ఒకవేళ తాను నేరుగా సమాధానమిస్తే, అది సరైన సమాధానమే అయినప్పటికీ ప్రజలు దానిని అపార్థము చేసుకుని అతి సునాయాసంగా దానిని దోషపూరిత మార్గంలో చూపించడమే కాక దురుపయోగం చేస్తారనేదే ముఖ్య కారణము. కావున జరగబోయే దురుపయోగాన్ని నివారించుటకు జనులలో భయం కలిగించటము ఒక్కటే శ్రేష్ఠమైన మార్గమని తలచి శుకుడు ఆ విధమైన సమాధానమును ఇచ్చెను. శుకుడు, కేవలము, భగవంతుడు ఊహలకు అందని తత్త్వము గల వాడు అనే ఒకే ఒక సత్యమును చూపి జనులలో ఆ మార్గమును అనుసరించవలెననే తృష్ణను తుంచివేశాడు.)]

అపవాదే మహాన్ తర్కః, స్వభావాత్ కర్మ నిశ్చయః |
కామోఽపి పురుషార్థేషు, మోక్షేణ సహ పాప్మ నో ||11.6||

[యథార్థముగా భగవంతుడు అట్టి అపరాధము చేసాడా అని తుదినిర్ణయము తీసుకునే ముందు భగవంతుని నిజతత్త్వమును అర్థం చేసుకోవాలి. ఎవరైనా నేరప్రవృత్తి గల వ్యక్తి గురించి తెలుకున్న తర్వాత అటువంటి సంఘటనలేవైనా జరిగితే నేరము ఆ నేరగాడే చేసి ఉంటాడనే ప్రాథమిక నిర్ధారణ చేస్తాము. కాని ఏ పాపమూ చేయని ఒకడు అకస్మాత్తుగా నేరము చేస్తే మనము తొందరపాటుతో అతని నేరమును నిర్ధారించలేము. అటువంటి విశేష వ్యక్తి విషయంలో ఆ ఘటనను లోతుగా విశ్లేషించి, ఎంతో సహనముతో విచారణ జరిపి అంతిమ నిర్ణయమునకు

రావలసి ఉంటుంది. కామము అనునది జీవాత్మ అనుగమించవలసిన ఒక ధర్మ మార్గముగా చెప్పబడటమే కాదు, జీవాత్మలకు నిర్దేశించిన నాలుగు పురుషార్థములలో (ధర్మ, అర్థ, కామ, మోక్షములు నాలుగు పురుషార్థములు) కామము యొక్క స్థానము, ప్రపంచ బంధాల నుండి కలుగవలసిన మోక్షము (విముక్తి) కంటే కేవలము ఒక్క అడుగు వెనుక ఉన్నదని గమనించాలి.)]

ప్రేరకా అపి కామస్య, ద్రైవ సృష్టాః ప్రజాకృతే |
కామోఽపి ధర్మ ఏకత్ర, సోఽధర్మోఽన్యత్ర కర్మ యః ||11.7||

[తాత్కాలిక శరీరముతో ముడిపడిన అంశము కామము. శరీరంలో ఉత్పన్నమైన హార్మోన్ల ప్రతిక్రియయే కార్యరూపంలోని కామము. కామము మరియు హార్మోన్లు ఈ రెండును భగవంతుని చేతనే సృష్టించబడినవి. ప్రతి తరానికి సంతానము కలగటానికి, తద్వారా మానవజాతి మనుగడ నిరంతరమూ కొనసాగుతూ భగవంతునికి వినోదము కలగించడము కొరకే ఈ ఏర్పాటు. హార్మోన్ల ప్రతిక్రియ ఫలితముగా కార్యరూపము దాల్చే కామక్రియ వివాహము తర్వాత జీవిత భాగస్వామితో జరగడము, ఫలితముగా సంతానము కలగడము అనేవి ధర్మసమ్మతమైనవి. **(ధర్మావిరుద్ధః …..*భగవద్గీత*)**. కామ భావనలకు గల ప్రత్యక్ష కార్యరూపమైన కామక్రియ ఒకవేళ వివాహానికి ముందు జరిగినా, లేదా వివాహానికి తర్వాత అన్యులతో జరిగినా అది అధర్మబద్ధమైనది. ఇక్కడ కీలకమైన అంశము ఏమిటంటే క్రియ ఒక్కటే, అయినా ఒక సందర్భములో ధర్మసమ్మతము అవుతుంది, మరొక సందర్భములో అదే క్రియ అధర్మబద్ధము కూడా అవుతున్నది.]

కర్మాపి ద్విముఖం సంగాత్, గుణవత్ కర్మణా న హి |
నిశ్చయో హననం స్వర్గ- నిరయాభ్యాం పృథక్ పృథక్
||11.8||

[గుణము లేదా స్వభావమునకు రెండు కోణములు ఉన్నట్లే (మంచి మరియు చెడు) కర్మలకు కూడా మంచి మరియు చెడు అనే రెండు కోణములు ఉంటాయి. కారణమేమిటంటే ఎప్పుడైనా గుణము మరియు కర్మ పరస్పరము ఆధారపడి ఉంటాయి. అంటే గుణము మరియు కర్మ రెండింటికీ రెండేసి చొప్పున స్వతంత్రమైన కోణములు (మంచి మరియు చెడు) ఉంటాయి. ఒకే కర్మ, మంచిదైన ఒక సందర్భములో మంచి ఫలితములను ఇస్తూ, చెడ్డదైన మరొక సందర్భములో చెడ్డ ఫలితములను ఇవ్వగలదు. ఒక మంచి మనిషి చెడ్డవానినొకడిని చంపినట్లైతే స్వర్గలోకం పొందగలడు, అదే కర్మ (చంపడము) ఒకవేళ ఒక చెడ్డ మనిషి మంచివానిని చంపితే నరకలోకము పొందగలడు. ఇక్కడ వేర్వేరు ఫలితాల నిచ్చే రెండు సందర్భాలలోను క్రియ - చంపడము ఒకటే, ఈ విధంగా చంపడము అనే క్రియ మాదిరిగానే మరొక ప్రత్యక్ష కర్మ, కామక్రియ.]

గుణ చిన్ముఖ మన్యస్య, గుణాదేవ ఫలం భవేత్ |
ఫలం కర్మ చ గుణతః, చిదేవ నిశ్చినోతి హి || 11.9 ||

[గుణము లేదా స్వభావము అనేది జడము కాని చైతన్యము - ఎందుకంటే గుణము కూడా చైతన్యము యొక్క విశేషమైన రూపాంతరమే. గుణము యొక్క మంచి కోణమును అనుసరించి దాని క్రియారూపము కూడా మంచిదే అవుతూ దానికి అంతిమముగా మంచి ఫలితమునే ఇస్తుంది. ఒక దుర్మార్గుడిని చంపాలని చేసే ఆలోచన మంచిది, కర్మ మంచిది, దానికి లభించే ఫలితము స్వర్గము. ఇదే విధముగా ఒక మంచివానిని చంపాలని చేసే ఆలోచన చెడ్డది, అట్టి కర్మ చెడ్డది తత్ఫలితముగా లభించునది నరకము. కావున కర్మ చేయునపుడు చైతన్యమును ప్రేరేపించెడి కారణమైన గుణము లేదా ఉద్దేశమే (కోణమే) తదుపరి చేయబడు కర్మ యొక్క స్వభావమును మరియు ఫలితము యొక్క స్వభావమును నిర్ణయిస్తుంది.]

ప్రేమ భావాత్మకం ద్వాభ్యాం, కామః కర్మాత్మకః పరమ్ |
ద్వయో స్తుల్యముఖే చాంత్యం, ఫలం హనన మీదృశమ్ || 11.10||

[పై ఉదాహరణలోని తర్కమునే అనుసరించి ఈ దృగ్విషయమును కూడా వివేచన చేయగలము. సాధారణ అర్ధములో చూస్తే స్వభావమునకు సంబంధించినంత వరకు ప్రేమ లేదా భావరూప మమత్వమును కోరిక అనవచ్చును. కామము అనునది ప్రత్యక్ష కార్యరూపమైన కామక్రియ మరియు భావరూపమైన కోరిక కలుగజేయు మూలభావన. ఒకవేళ మంచి వైపున్న ప్రేమ అంటే వివాహబద్ధమైన భాగస్వామితో కామక్రియ మంచిది, దీనికి లభించే ఫలితము మంచిదైన స్వర్గలోకము. అలా కాక ప్రేమ చెడు దిశలో ఉంటే, అనైతిక బంధములోని వ్యక్తితో కామక్రియ నీచమైనది, దానికి లభించు ఫలితము ఘోరమైన నరకము. దీనిని బట్టి చూస్తే ప్రేమ కాని లేదా భావరూప మమత్వము కాని తమంతట తాముగా మంచివి గాని చెడ్డవి కాని కాదు, వాటి దిశను బట్టి మరియు సందర్భమును బట్టి మాత్రమే అవి మంచివో చెడ్డవో తెలుస్తుంది. అదే విధంగా క్రియారూపాలైన కామక్రియ లేదా కామము కూడా తమంతట తాము మంచివి కావు చెడ్డవీ కావు, ఈ నిర్ణయము అవి మళ్ళిన దిశను బట్టి సందర్భమును బట్టి చేయవలసి ఉంటుంది.]

కామ ప్రేమ సాధు ముఖం, వివాహే ధర్మ శాస్త్రతః |
అధర్మ తప్త మూర్తేస్తు, పరిరంభ ఇతి స్మృతః ||11.11||

[ఒకవేళ భావరూప మమత్వము (ప్రేమ) దాని వలన కలిగే ప్రత్యక్ష కామము పైన చెప్పినట్లు ధర్మబద్ధమైనవి అయితే భగవంతుడు నిర్ణయించిన ప్రవృత్తిని బోధించెడి రాజ్యాంగములో వాని ఫలితము స్వర్గలోకము. ఒకవేళ భావరూప మమత్వము (ప్రేమ)

దాని వలన కలిగే ప్రత్యక్ష కామము అధర్మబద్ధమైనది అయితే భగవంతుని ధర్మగ్రంథము ననుసరించి నరకములో లభించే ఘోరమైన శిక్ష ఏమిటంటే అనైతిక కామబంధము గల వ్యక్తి యొక్క ఎర్రగా కాల్చిన రాగి విగ్రహమును రెండవ వ్యక్తి కౌగిలించుకొనవలెను.]

ప్రవృత్తి దుష్ప్రవృత్తిభ్యాం, స మితో జీవశాసకః |
నివృత్తిః ప్రేమ మహతీ, సైవ కామః పరాత్మనః || 11.12||

[ధర్మగ్రంథములు అను భగవంతుని రాజ్యాంగశాసనముల ద్వారా ప్రతిష్ఠించబడిన ప్రవృత్తి లేదా ప్రాపంచిక జీవిత విధులను అనుసరించి ప్రేమ మరియు కామము, స్వర్గలోకమును ఇవ్వగల న్యాయసమ్మతమైన మూలములు. ఒకవేళ ప్రేమ, కాములు పాపపూరిత కర్మలైతే అవి నరకాన్నిచ్చే దుష్ప్రవృత్తి అవుతుంది. భగవంతుడు తన శాసనములలో ఈ రెండింటి పైనే (ప్రవృత్తి, దుష్ప్రవృత్తి) తన మొత్తము కార్యరంగమును సిద్ధము చేసుకున్నాడు. జన్మించిన ప్రతి జీవాత్మకు ఈ రెండు తెలుసుకుని మెలగవలసిన ధర్మములు. నివృత్తి లేదా ఆధ్యాత్మిక జీవితము అంటే భగవంతునిపై భావరూప ప్రేమ లేదా భగవంతుని వైపున్న మమత్వము. ఇదే పతాక స్థాయికి చేరినపుడు మహానివృత్తి అనబడు ఆధ్యాత్మిక జీవితపు శిఖరాగ్ర స్థితి. పరిపక్వమైన భావరూప ప్రేమ లేదా మమత్వము ప్రత్యక్ష కార్యరూపమైన కామక్రియగా మారినపుడు, స్వయముగా భగవంతునితోనే సాధ్యమవుతుంది.]

తే ద్వే వైయక్తికీ తస్య, భక్త నీతే రుణద్ధి సః |
ఉత్తరే నింద్యతే నాశ్మ, శ్రుతః ప్రేమ రసః పరః ||11.13||

[భగవంతునికి హృదయసంబంధమైనవి, ఇంకా వ్యక్తిగతమైనవి నివృత్తి మరియు మహానివృత్తి, కావున ఇక్కడ ధర్మాధర్మ వివేచనకు తావు లేదు. అయితే భక్తులే కనుగొన్న ఈ రెండు వ్యక్తిగత సంబంధాలను భగవంతుడు పూర్తిగా వ్యతిరేకిస్తాడు. ఈ

మూలబిందువును ఆధారముగా చేసుకుని రెండు విధానాలలో భగవంతుని అపరాధమును ఎంచలేము. కాని, నివృత్తి, మహానివృత్తులందు భగవంతుడు, తన ప్రతిస్పందన కారణముగా నిందింపబడినాడు. భగవంతుడు ఒక జడమైన రాయి వలె యాంత్రికముగా , ఈ ప్రపంచపు రాజ్యాంగమునే అనుసరించి ప్రతిస్పందించవలెనని జనులు కోరతారు. వేదముల ద్వారా భగవంతుడు, తాను ప్రేమ స్వరూపుడనని తెలిపారు (**రసో వై సః**). భగవంతుని ఒక జడ యంత్రము వలె భావించుట సమ్మతము కాదు.]

తాపసా దేహ దానార్తాః, ప్రకృత్యంశః స పూరుషః |
విరుద్ధా రామ కృష్ణాభ్యాం, ఏషణాసు పరీక్షయా ||11.14||

[భగవంతుని కోసం ఋషులు ఎన్నో జన్మల పర్యంతము కఠినమైన తపస్సు చేసారు. ప్రాపంచిక బంధాలను మరియు శరీరంతో గల బంధమును భగవదర్పణము చేయదలచి, వారు తమ సిద్ధుల మహిమలతో స్త్రీల రూపము దాల్చాలనుకున్నారు, ఎందుకంటే వారు, ప్రతి ఒక్క జీవాత్మ ప్రకృతి లేదా విశ్వములో భాగమని, కావున స్త్రీరూపమని, భగవంతుడు ఒక్కడే పురుషుడని వేదము ద్వారా సత్యము తెలిసిన జ్ఞానులు. ఈ ప్రతిపాదనతో వారు తత్కాలీన వర్తమాన నరావతారమైన శ్రీరాముని దివ్యత్వమును తెలిసికొని సాక్షాత్ భగవంతుడని రాముని చెంతకే చేరారు. సంపదతో వారికి గల బంధము, జీవిత భాగస్వామితో గల బంధము, సంతానముతో గల బంధము అనే మూడు బలమైన బంధాలైన ఏషణలను భగవంతుడైన శ్రీరాముడు పరీక్షించదలచి, వారిని తదుపరి జన్మలో గోపికలుగా జన్మించమని కోరాడు. నివృత్తి మరియు మహానివృత్తి ప్రతిపాదనలను శ్రీరాముడే కాదు, శ్రీకృష్ణుడు కూడా వ్యతిరేకించారు.]

కృష్ణ విగ్రహ సంతుష్టాః, తిరస్కార ముమూర్షవః |

భగవాన్ పరమ ప్రీతః, నైష పాషాణ విగ్రహః ||11.15||

[శ్రీకృష్ణుడు గాని తిరస్కరిస్తే, తమ జీవితాలను అంతము చేసుకోగలమని, గోపికలు శ్రీకృష్ణుని బెదిరించారు. ఇలాంటి క్రియలకు ప్రతిగా వారు ఎర్రగా కాలిన రాగి విగ్రహమును కౌగలించు కోవలసి వస్తుందని శ్రీకృష్ణుడు బెదిరించగా, ఆ విగ్రహము శ్రీకృష్ణునిదే కాబట్టి వారికెంతో ఆనందమని బదులిచ్చారు. దానికి శ్రీకృష్ణుడు ఎంతగానో కదిలిపోయాడు. ఎందుకంటే శ్రీకృష్ణుడు పరిశుద్ధప్రేమైకస్వరూపుడు, పాషాణము కాదు. యాంత్రికంగా ఈ ప్రపంచములో, సృష్టించబడిన జీవుల ధర్మమును తాను అనుసరించడానికి, భగవానుడైన శ్రీకృష్ణుడు రాతితో తయారైన జడ విగ్రహము కాదు.]

పంచభిః కారణైః పూర్వ-చతుర్భిశ్చ ప్రకాశితైః |
ధర్మ చ్యుతి ర్నివృత్త్యై హి, న కృతా దుష్ప్రవృత్తయే||11.16||

[శ్రీకృష్ణ పరమాత్మ గోపికలకు అనుకూలముగా వ్యవహరించుటకు క్రింద చెప్పిన ఐదు కారణములున్నవి. అవి -

1. ఒక్క జీవిత భాగస్వామితో గల బంధము తప్ప, ఆ ఋషులు అప్పటికే వారి ప్రాపంచిక బంధాలన్నింటినీ జయించారు. ఈ బంధము చివరిదైన స్త్రీ జన్మలో మాత్రమే పరీక్షించబడును. ఎందుకంటే ఆనాటి యుగంలో పురుషులు, ఎటువంటి సామాజిక వ్యతిరేకత లేకుండా, అతి సులభముగా భార్యతో బంధమును వీడగలరు.

2. అప్పటికే అన్ని ప్రాపంచిక బంధాల నుండి విముక్తి పొందిన జీవాత్మలైన ఋషులకు చివరి జన్మలో ఈ ఒక్క బంధముకు సంబంధించిన పరీక్ష మాత్రమే జరిగినను, సంపూర్ణ పాత్య

ప్రణాళికకు సంబంధించిన వార్షిక పరీక్ష మాదిరిగా అన్ని బంధాల పరీక్షలతో కలిపి ఈ బంధము పరీక్షింపబడినది.

3. స్త్రీజన్మ పొందితే తప్ప పురుష సంబంధమైన లింగాహంకారము మాయము కాదు, కావున ఋషులకు చివరగా స్త్రీజన్మ లభించినది.

4. ఈ ఒక్క బంధముతో గల పోటీలోనూ భగవంతునితో గల బంధము నిలిస్తే తప్ప ప్రాపంచిక బంధాలన్నింటి నుండి విముక్తి సాధ్యము కాదు. కావున ఈ పరీక్ష జీవిత భాగస్వామితో బంధవిముక్తి పొందడము కోసమే. పిల్లల కొరకు దాచుకున్న వెన్నను దోచుకున్నపుడే గోపికలకు ధనేషణ, పుత్రేషణ పరీక్షలు జరుపబడినాయి.

5. శ్రీకృష్ణుని తల్లియగు అమ్మ యశోదకు వెన్న దొంగతనము గురించి ఫిర్యాదు చేసిన కారణముగా చాలా మంది గోపికలు ధనేషణ, పుత్రేషణ అను పరీక్షలలో ఓడిపోయారు. కాని ఇంచుమించుగా గోపికలందరూ, బృందావనములో శ్రీకృష్ణునితో అర్ధరాత్రి నృత్యములో పాల్గొన్నారు. దీనిని బట్టి ఏషణలలో కెల్లా దారేషణ (భార్యాభర్తల బంధము) అతిబలహీనమైనదని తెలుస్తుంది. ఈ ఒక్క ప్రాపంచిక బంధము మాత్రమే విడాకుల ద్వారా తుంచివేయబడగలదు, మరే ఇతర బంధాలకు ఈ సౌకర్యము లేదు. కావున ఈ బంధము చివరి జన్మలో పరీక్షింపబడినది. గోపికలు తల్లి పాత్రలో ఓడినారు కాని భార్య పాత్రలో గెలిచినారు. ఒకవేళ ఈ పరీక్షయే చివరిదైతే, గోపికలంతా గోలోకంలో ఉండేవారు, కాని ఈ పరీక్షతో పాటు అన్ని పరీక్షలలో గెలిచిన పన్నెండు మంది గోపికలు మాత్రమే గోలోకమును పొందగలిగినారు.

ఈ ఐదు కారణాలే కాకుండా భగవంతుడు నిందింపబడకూడదని మరో నాలుగు కారణాలు పూర్వ అధ్యాయాలలో **మేము** తెలిపినాము. మనము గుర్తుంచుకోవలసినది ఏమిటంటే ధర్మమును ఉల్లంఘించినది పాపకర్మ కొరకు కాదు, కేవలము భగవంతుని కోరుకొని నివృత్తి పొందడానికే.]

ఆశ్చర్య మూర్ఛితం దైవం, పాదధూళి శిరోఽభవత్|
మోక్ష ఉక్తః న మార్గోఽస్య, తద్విరోధార్థ శంకయా ||11.17||

[తన కొరకు ప్రాపంచిక బంధాలన్నీ విడువగల గోపికల అనూహ్యప్రేమను చూసి భగవంతుడు ఎంతో సంతోషించినాడు. వారికి గల అవ్యాజమైన అనూహ్యప్రేమకు ప్రతిగా సరైన బహుమతి ఇవ్వదలిచినాడు. గోపికలను వారి పూర్వ పాపకర్మల ఫలితముల నుండి విముక్తి చేసి ఆ పాప ఫలములను తన మీదకు తీసుకుని శిక్షలను అనుభవించడము ద్వారా ప్రాపంచిక ధర్మశాసనాలను పరిరక్షించినాడు. గోపికల కొరకు తన ఆవాసము పైన గోలోకమును సృష్టించినాడు. ఆ రకముగా నిరంతరము వారి పాదధూళి తన శిరస్సుపై పడే ఏర్పాటు చేశాడు. ఇది వారి అనూహ్య ప్రేమకు అనూహ్య ప్రతిఫలము. భగవద్గీత యందు భగవానుడు గోపికలకు పాపవిముక్తి జరిపిన వివరము తెలుపలేదు, ఎందుకంటే వారు చేసిన అన్ని పాపముల నుండి విముక్తి చేయగల యథార్థ విధానము అనగా, 'తమ పాపములను స్వీకరించి భగవంతుడు శిక్ష పొందుతాడని' గోపికలకు తెలిస్తే భగవంతుడే స్వయముగా తమ పాపఫలితముల శిక్ష అనుభవించే కార్యవిధానమును వారు తప్పక నిరోధిస్తారు.]

జ్ఞాతాస్తా భగవానాహ, స్వ విరోధః శుచే భవేత్ |
శ్రుత్వా తత్తా మహాశ్చర్యాః, అంగీచక్రుశ్చ తత్ కృతమ్ ||11.18||

[భగవంతుడు పాపవిముక్తి కలిగించగల ఇట్టి విధానము తెలిసిన గోపికలు శ్రీకృష్ణ భగవానుని నిరోధించినారు. ఎందుకంటే సుదీర్ఘ తపస్సుల కారణముగా వారికి ఎదుటివారి మనసులోని ఆలోచనలు తెలుసుకోగల అద్భుత శక్తి సొంతమైనది. అప్పుడు భగవంతుడు వారిని ఊరడిస్తూ తాను అతి ప్రియముతో, సంతోషముతో మాత్రమే

గోపికల శిక్షలను అనుభవించగలనని, బాధతోనో, క్షోభతోనో కాదని అనునయించినారు. ఒక అడుగు ముందుకు వేసి, ఒకవేళ గోపికలు తనను శిక్షానుభవాల నుండి నివారిస్తే, యథార్థముగా అప్పుడు తను అమితమైన బాధను, దుఃఖాన్ని పొందగలనని అన్నారు. భగవంతునికి తమ పట్ల గల అద్వితీయ ప్రేమను చూసి గోపికలు కదిలిపోయారు. చివరికి ఈ విధముగా గోపికలకు తమ పాపకర్మల ఫలితముల నుండి విముక్తిని అంగీకరించక తప్పలేదు.]

ఆత్మానం రహసి ప్రాప్తః, న చౌర్యం తత్ ప్రవృత్తిగమ్ |
పూర్వం ధర్మో హ్యధర్మాత్తు, పరం ధర్మాచ్చ సోఽవ్యయః ||11.19||

[గోపికలు తమ పరివారములో కలత రేగకుండా ఉండటానికి, అర్ధరాత్రులలోనే శ్రీకృష్ణునితో నాట్యమాడేవారు. (**ఆత్మానం రహసి స్థితః....*భగవద్గీత***). 'ఆత్మ' అనునది పరబ్రహ్మము విలీనమైన స్థూలశరీరములో గల ఆత్మ అని అర్థము. కావున ఇది ధర్మబద్ధమైన కుటుంబాలను మోసగించి, అనైతిక వ్యవహారము కొరకు జరిపిన పాపకర్మ లేదా దుష్ప్రవృత్తి కాదు. ప్రవృత్తిలో ధర్మము (తాత్కాలిక స్వర్గము)ను ఎన్నుకొని అధర్మమును (తాత్కాలిక నరకము) వదిలివేయాలి. నివృత్తిలో శాశ్వతుడైన భగవంతుని ఎన్నుకొనుటకు అవసరమైతే, తాత్కాలిక స్వర్గమును ప్రసాదించగల ధర్మమును కూడా వదలివేయాలి.]

పండితా ఏవ జానంతి, సత్యజ్ఞానం పరో జనః |
విశ్వాసేనాను కుర్యాన్న, నిశ్చిను త్రిభిరుత్తమైః ||11.20||

[సత్యమైన ఇట్టి జ్ఞానమును జిజ్ఞాసువులు తమ పదునైన తర్కవిశ్లేషణతో తెలుసుకోగలరు. భగవంతుడు ఎన్నడూ అధర్మము చేయడనే పరమ సత్యమును సాధారణ ప్రజలు విశ్వసిస్తారు. కాని భగవంతుడిని ఎవ్వరూ గుడ్డిగా

అనుకరించరాదు. భగవంతుని ప్రతికార్యము ధర్మబద్ధమైనది, సత్యమైనది అని ప్రతి ఒక్కరూ నిశ్చయమును పొందాలి. ఏ స్త్రీ లేదా పురుషుడు అయినా ఈ విషయ విశ్లేషణ చేయదలచినపుడు మూడు అంశములతో ఆరంభించాలి.

1. పరమోత్కృష్టమైన భగవంతుని అవతారము అయిన శ్రీ కృష్ణుడు, పరమోత్కృష్టమైన దత్తావతారము.

2.పరమోత్కృష్టమైన ఫలితముగా ఇవ్వబడినది భగవంతుని నివాసము కంటే పైన ఉన్న పరమోత్కృష్టమైన గోలోకము.

3.పరమోత్కృష్టమైన జీవాత్మలు అయిన ఋషులు కోట్ల కొలది జన్మలలో ఘోరతపస్సులు చేసి చివరి జన్మలో పరమోత్కృష్ట భక్తులైన గోపికలుగా జన్మించినారు.

ఈ మూడు పరమ విశేషముల నుండి ఆయా ఋషులు అనుసరించిన మార్గము పరమ ఉత్కృష్టమైనదని, పరమ పవిత్రమైనదని ఎవరికైనా సులభంగా విశదమగును.]

ఇతి త్రైలోక్యగీతాయాం 'మధురభక్తి విచారయోగో' నామ ఏకాదశాధ్యాయః ||

[ఈ విధంగా త్రైలోక్యగీత యందు పదకొండవ అధ్యాయము అయిన 'మధురభక్తి విచారయోగము' పరిసమాప్తము]